తొలి క్రాంతి NEWS

https://www.tholikranthidaily.in TEL TEL - 12281

# తొలిక్రాంతి

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక..

హైదరాబాద్
గురువారం
29-5-2025
వెల రూ. 4/-
పేజీలు : 04

**Published From : Hydarabad    Editor : Malothu Chandrakala**




## ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

- దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా చేయలేదు
- గత పదేళ్లలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదు
- రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

2

హైదరాబాద్ ప్రతినిధి మే28(తొలి క్రాంతి): జీవితంలో తొలి మెట్టు ఎక్కబోతున్న విద్యార్థినీ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చదువుకోవడం ద్వారా కుటుంబానికే కాకుండా, సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవొచ్చని ఉద్భోదించారు.



## ఖరీఫ్ పంటలకు ఎంఎస్పీ పెంపు

- పలు రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- ఎంఎస్పీకి రూ. 2,07,000 కోట్లు కేటాయింపు
- స్వల్ప వడ్డీ రేటు రుణాలకు రూ. 15,642 కోట్లకు ఆమోదం
- బద్వేల్—నెల్లూరు రైల్వే ప్రాజెక్టుకు రూ. 3,653 కోట్లు

రత్లాం—నాగ్డా విస్త రణకు ఒకే

2



వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

## జూన్ 2న మంజూరీ పత్రాలు

- రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు
- రూ. లక్ష లోపు సబ్సిడీ రుణాల కేటగిరీలో 85,000 మందికి మంజూరీలు అందిస్తాం
- రాజీవ్ యువ వికాస్ పథకం కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



## విద్యార్థులతో వెట్టిచాకిరీ

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- విద్యార్థులే టాయిలెట్స్ కడగాలి అంట
- కాంగ్రెస్ పాలనలో గురుకులాల పరిస్థితి ఇది
- తక్షణమే సంబంధిత అధికారిని తొలగించాలి
- ప్రతి పాఠశాలకు నెలవారీ మెయింటెనెన్స్ ఖర్చులు మంజూరు చేయాలి
- అది జర్నలిజమా లేక శాడిజమా

2





## ఇది ఎన్డీయే నివేదిక

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఎన్ని కుట్రలు సృష్టించినా ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుంది
- కేసీఆర్ దూరదృష్టి గల నాయకుడు

## కలెక్టర్ తీరు వావ్!

ప్రభుత్వ ఆస్పత్రిలో సతీమణికి కాన్పు

4

ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్న కలెక్టర్ దంపతులు






## అనుమతి తప్పనిసరి

- పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలి
- వ్యక్తిగత అజెండాలతో వేదికను ఉపయోగించవద్దు
- ప్రెస్‌మీట్‌లు పెట్టడం వ్యక్తిగత దూషణల చేయడం సరైంది కాదు
- కేంద్రమంత్రి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

2

## ఏపీ తెలంగాణ రెండు కళ్ల లాంటివి



- హైదరాబాద్ అభివృద్ధి చేసింది నేనే
- కాళేశ్వరం కట్టినప్పుడు నేనెప్పుడూ వ్యతిరేకించలేదు
- రాయలసీమ, ఉత్తరాంధ్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు
- మహానాడులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక


కడప ప్రతినిధి మే28(తొలి క్రాంతి):తెలుగుదేశం పార్టీ (టీడీపీ) జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 30 ఏళ్లుగా పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన, కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు రెండవ రోజున మరోసారి ఈ పదవికి ఎంపికయ్యారు. పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య, చంద్రబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్యమంత్రి పార్టీ శ్రేణులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై స్పష్టతనిచ్చారు.

2



# ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

హైదరాబాద్ ప్రతినిధి మే28(తొలి క్రాంతి):జీవితంలో తొలి మెట్టు ఎక్కబోతున్న విద్యార్థినీ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చదువుకోవడం ద్వారా కుటుంబానికే కాకుండా, సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవొచ్చని ఉద్బోధించారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలోని ఎస్సీ గురుకులాల నుంచి ఐఐటీ, ఎన్‌ఐటీల్లాంటి ప్రఖ్యాత సంస్థల ప్రవేశాలతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10 వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవార్డుల బహూకరణ, ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలకు ప్రోత్సాహకాలు అందించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో కలిసి పాల్గొన్న ముఖ్యమంత్రి ముందుగా ప్రాంగణంలో విద్యార్థుల చిత్రకళా గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "అసమానతలు తొలగించి సమసమాజం నిర్మించాలన్న ఆనాటి పోరాటయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోంది. గురుకులాల్లో చదువుకుంటున్న మా పిల్లలు రేపటి రోజున ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కాంక్షిస్తున్నా. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి, మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును.. ఇలా ఎందరో త్యాగమూర్తుల స్ఫూర్తితోనే సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది. జవహర్ లాల్ నెహ్రూ గారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నాం.ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువు చాలా ముఖ్యం. చదువులో మరో మెట్టు ఎక్కబోతున్న విద్యార్థుల ముందు రకరకాల రంగుల ప్రపంచం ఆకర్షణీయంగా ఉంటుంది. ఊహాగానాల్లో తిరగకుండా జీవితంలో 25 సంవత్సరాలు వచ్చే వరకు కష్టపడి చదువుకుంటే ఈ సమాజంలో గౌరవంగా బతకడానికి, భవిష్యత్తులో రాణించడానికి వీలవుతుంది. దారితప్పితే తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. చదువుకుంటే గ్రామం నుంచి రాష్ట్రం వరకు గర్వంగా బతికేలా చేస్తుంది.వందేళ్ల చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారి దళితుడిని వీసీగా నియమించాం. ఆ కోవలోనే సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా, రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా గతంలో ఎప్పుడూ లేని విధంగా దళిత బిడ్డలు ఈ పదవులు చేపట్టారంటే వారికి కేవలం కులంతోనే అవకాశాలు రాలేదు. వారు ఉన్నత స్థాయిలో చదువుకుంటే వచ్చాయి.దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి. ఆ లక్ష్యంతోనే రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడున్న గురుకుల పిల్లల్లో ప్రతిభ ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది. భవిష్యత్తులో కచ్చితంగా రాణించగలుగుతారన్న నమ్మకం నాకుంది. కుటుంబానికే కాకుండా గ్రామానికి, దేశానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తారు.దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉన్నదని సంపూర్ణంగా విశ్వసించే వాడిని. కష్టపడి చదివితే రాణిస్తారు. మీరు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నా. మీకెప్పుడూ తోడుగా ఉంటా. భవిష్యత్తులో రాణించాలని మన స్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా..."ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా చేయలేదని గత పదేళ్లలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదుఅని ముఖ్యమంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ , సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ , పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.



# ఏపీ తెలంగాణ రెండు కళ్ల లాంటివి

– హైదరాబాద్ అభివృద్ధి చేసింది నేనే– కాళేశ్వరం కట్టినప్పుడు నేనెప్పుడూ వ్యతిరేకించలేదు– రాయలసీమ, ఉత్తరాంధ్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు– మహానాడులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు– టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నికకడప ప్రతినిధి మే28(తొలి క్రాంతి):తెలుగుదేశం పార్టీ (టీడీపీ) జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 30 ఏళ్లుగా పార్టీ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన, కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు రెండవ రోజున మరోసారి ఈ పదవికి ఎంపికయ్యారు. పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య, చంద్రబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్యమంత్రి పార్టీ శ్రేణులను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతికి సంబంధించిన పలు అంశాలపై స్పష్టతనిచ్చారు.ముందుగా, తనను ఏకగ్రీవంగా ఎన్నుకుని గురుతర బాధ్యతను అప్పగించిన పార్టీ నేతలు, కార్యకర్తలందరికీ చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. "తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం, బలగం" అని ఆయన ఉద్ఘాటించారు. కడప మహానాడు విజయవంతం కావడం పట్ల, ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. ఈ మహానాడులో ఆరు తీర్మానాలు, అర్థవంతమైన చర్చల ద్వారా రాబోయే 40 ఏళ్లకు ప్రణాళికలు రచించుకున్నామని, ప్రపంచపటంలో తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలబెట్టే సత్తా ఒక్క తెలుగుదేశం పార్టీకే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహానాడుకు ప్రకృతి కూడా సహకరించిందని పేర్కొన్నారు.హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి సైబరాబాద్‌ను సృష్టించింది టీడీపీయేనని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండూ తనకు కండ్లులాంటివి అని చంద్రబాబు అన్నారు. 47 ఏళ్లుగా ఆదరించిన ఆంధ్రప్రదేశ్ రుణం తీర్చుకోవాలనే రాత్రింబవళ్లు శ్రమిస్తున్నానని, రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి రైతుల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని పునరుద్ఘాటించారు. అమరావతిని ప్రజారాజధానిగా నిర్మించేందుకు ప్రాజెక్టులను పట్టాలెక్కించామని, తన హైకమాండ్ అయిన కార్యకర్తలు, ప్రజల ఆశీస్సులతో ఒక్కొక్కటిగా అన్నీ సాధిస్తామని చెబుతూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు ప్రజల ఆస్తులకు రక్షణ కరువైందని, గంజాయి, డ్రగ్స్ వంటివి విచ్చలవిడిగా



రాజ్యమేలాయని ఆరోపించారు. "వైసీపీ హయాంలో ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఒక కుటీర పరిశ్రమగా మారింది. గత ప్రభుత్వ అధినేతే తన బాబాయ్‌ను హత్య చేయించి, ఆ నిందను నాపై మోపే ప్రయత్నం చేశారు," అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నక్సలిజం, ఫ్యాక్షనిజం, రౌడీయిజాన్ని రూపుమాపిన ఘనత టీడీపీదేనని గుర్తుచేశారు.

## ఖరీఫ్ పంటలకు ఎంఎస్ పీ పెంపు

**కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**

న్యూఢిల్లీ మే28(తొలి క్రాంతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది. బుధవారం కేంద్ర కేబినెట్ భేటీలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్పీ, వడ్డీ సబ్సిడీ, పలు రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం కల్పించింది. కేబినెట్ లో తీసుకున్న వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు. 2025–26 సెషన్ కు ఖరీఫ్ పంటలకు ఎంఎస్పీకి రూ. 2,07,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల సంక్షేమానికి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కేంద్రమంత్రి వర్గం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఖరీఫ్ పంటలకు ఎంఎస్పీ, వడ్డీ సబ్సిడీ పథకం, జాతీయ రహదారులు, రెండు రైల్వే లైన్లు, మూడు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు తీసుకున్న నిర్ణయాల్లో ఉన్నాయన్నారు. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం వరి, మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, సోయాబీన్ మద్ధతు ధరను పెంచామన్నారు. ఇందుకు గాను రూ. 2,07,000 కోట్లకు ఆమోదం తెలిపామన్నారు. రైతులకు నాలుగు శాతం స్వల్ప వడ్డీ రేటుతో రూ. 2 లక్షల వరకు స్వల్పకాలిక రుణం అందజేస్తామన్నారు. ఇందుకు గాను రూ. 15,642 కోట్లకు ఆమోదం తెలిపామన్నారు. సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు 1.5 శాతం వడ్డీలో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 3 శాతం వరకు అదనపు వడ్డీ సబ్సిడీ లభిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 108 కి.మీ. పొడవైన నాలుగులేన్ల ప్రాజెక్టు బద్వేల్–నెల్లూరు రూ. 3,653 కోట్లతో ఆమోదం తెలిపామన్నారు. మహారాష్ట్రలోని వార్ధా–బల్లార్షా రైల్వే లైన్ డంబ్లింగ్ చేపడతామని చెప్పారు. దీంతో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకల సామర్థ్యాన్ని రెట్టింపవుతుందన్నారు. మధ్యప్రదేశ్ లోని రూ. 1,108 కోట్లతో రత్లాం–నాగ్డా వరకు 41 కి.మీ. పొడవైన రైల్వే లైన్ ను నాలుగు లైన్లుగా విస్తరిస్తామని చెప్పారు. భారతీయ రైల్వేలైన్ ల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఏ పంటకు ఎంత పెరిగింది..2025–26లో వరి (సాధారణ) క్వింటాలుకు రూ. 2,369 ప్రకటించారు. 2024–25లో రూ. 2,300గా ఉంది. రూ. 69 పెరిగింది. వరి (ఎ గ్రేడ్) రూ. 2,320 నుంచి రూ, 2389కి పెంచారు. జొన్నలు (హైబ్రిడ్) 3,371 నుంచి రూ. 3,699కి పెంచారు. జొన్నలు(మల్దండి రకం) 3421 ఉండగా, 3749కి పెంచారు. రాగులు రూ. 4290 ఉండగా, రూ. 4,886కు పెంచారు. మొక్కజొన్న రూ. 2,225 నుంచి రూ. 2,400కు పెంచారు. కందులు రూ. 7550 నుంచి రూ. 8000లకు పెంచారు. పెసలు రూ. 8682 నుంచి రూ. 8,762కు పెంచారు. సెనగపప్పు రూ. 7400 నుంచి రూ. 7800కు పెంచారు. వేరుశెనగ రూ. 6783 నుంచి రూ. 7,263కు పెంచారు. పొద్దుతిరుగుడు రూ. 7,280 నుంచి రూ. 7721కి పెంచారు. సోయాబీన్ రూ. 4,892 నుంచి రూ. 5328కి పెంచారు. పత్తి (సాధారణం) రూ. 7,121 నుంచి రూ. 7710కి పెంచారు. పత్తి (మేలురకం) రూ. 7521 నుంచి రూ. 8,110కి పెంచారు.

## జూన్ 2న మంజూరీ పత్రాలు

**రాజీవ్ యువ వికాస్ పథకం కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

హైదరాబాద్ ప్రతినిధి మే28(తొలి క్రాంతి):రాజీవ్ యువ వికాస్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2న మంజూరీ పత్రాలు (ప్రొసీడింగ్స్) అందజేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 16.23 లక్షల దరఖాస్తులు వచ్చాయని, మొదటివిడతలో రూ. 50 వేల నుండి రూ. లక్ష లోపు సబ్సిడీ రుణాల కేటగిరీలో 85,000 మందికి మంజూరీలు అందిస్తామని చెప్పారు. జూన్ 10–15 మధ్య శిక్షణ, 16–20 మధ్య సబ్సిడీ విడుదల, 21–30 మధ్య యూనిట్ల స్థాపన (గ్రౌండింగ్) జరిగేలా షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు.జులైలో లక్ష–2 లక్షల కేటగిరీకి, ఆగస్టు–అక్టోబరులో 2–4 లక్షల కేటగిరీకి మరో 3 లక్షల మందికి మంజూరీలు అందిస్తామని తెలిపారు. మొత్తం ఐదు విడతల్లో 5 లక్షల మందికి సబ్సిడీగా రూ. 6,260 కోట్లు, బ్యాంకు లింకేజీగా రూ. 1,667 కోట్లు కలిపి రూ. 8 వేల కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.లబ్ధిదారులు యూనిట్లు స్థాపించి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగాలని, మానిటరింగ్ కమిటీల ద్వారా పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు.





## అనుమతి తప్పనిసరి

**కేంద్రమంత్రి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి**

హైదరాబాద్ ప్రతినిధి మే28(తొలి క్రాంతి):బీజేపీ అంటే బాధ్యతగల పార్టీ అని సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ అని కేంద్రమంత్రి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా పార్టీ ఆఫీస్‌ను ఆశ్రయిస్తున్నారని అలాంటి వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేసేలా నాయకుల తీరు ఉండాలని సూచించారు.బుధవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమైన ఆయన పార్టీ నియమాలు, ఆచరణలపై కొన్ని కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఎవరికి వాళ్లు పార్టీ కార్యాలయాన్ని వేదికగా చేసుకుని ప్రెస్‌మీట్‌లు పెట్టడం వ్యక్తిగత దూషణలు చేయడం సరైంది కాదని హితవు పలికారు.పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని వ్యక్తిగత అజెండాలతో వేదికను ఉపయోగించవద్దని హెచ్చరించారు. పార్టీ వేదికపై వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యవహరించే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని స్పష్టం చేశారు. ఇది తనతో పాటు అందరికీ వర్తిస్తుందని పేర్కొన్నారు.మొత్తానికి, బీజేపీ నేతలు పార్టీ ఆచారసమితి ఆత్మకథన విధానాలకు కట్టుబడి ఉండాలని కిషన్ రెడ్డి స్పష్టంగా పేర్కొన్నారు.

# విద్యార్థులతో వెట్టిచాకిరి

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్ ప్రతినిధి మే28(తొలి క్రాంతి):తెలంగాణలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లో కొనసాగుతున్న పరిస్థితులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. పిల్లలతో శానిటేషన్, వంట, హాస్టల్ నిర్వహణ పనులు చేయించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గురుకుల పాఠశాలకు శానిటేషన్, స్వీపింగ్ కోసం నెలకు రూ. 40,000 మంజూరు చేసేది. దీనితో నాలుగు తాత్కాలిక ఉద్యోగులు టాయిలెట్లు తరగతి గదులు శుభ్రం చేసేవారని ఆమె గుర్తు చేశారు. అయితే గత సంవత్సరం ఆగస్టు నుండి ఈ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో పిల్లలే టాయిలెట్లతో పాటు పాఠశాల ఆవరణ శుభ్రపరిచే పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె అన్నారు.ఈ విధానాన్ని విమర్శిస్తూ, "శ్రమను గౌరవించడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు" అని స్పష్టం చేశారు. "బోర్డు తుడవడం, టాయిలెట్ కడగడం ఒకటి కాదు" అని ఒక ఐఏఎస్ అధికారిణి "ఫుడ్ టేబుల్ పైకి వచ్చేందుకు కూర్చుంటే రావదు" అనే వ్యాఖ్యను తీవ్రంగా ఖండించారు. పోష్ పిల్లలు కాకపోయినా గురుకులాల్లో చదివే ప్రతి విద్యార్థి సమాజంలో సమానంగా చూడబడాలన్న సంకేతం రావాల్సిన సమయంలో వివక్ష ప్రదర్శించబడుతోందని విమర్శించారు.భిక్కనూరు గురుకుల పాఠశాలలో వాచ్‌మెన్ ఒకరు వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తూ మృతి చెందడం మరొకరికి గాయాలు కావడం ఘటనను ప్రస్తావించారు. రాష్ట్రంలోని 240 గురుకులాల్లో అసిస్టెంట్ కేర్ టేకర్లను తొలగించడం ద్వారా వార్డెన్ పనులు పిల్లల మీద పడుతున్నాయని తెలిపారు. గతంలో పిల్లలు క్వాలిటీ చెక్ మాత్రమే చేసేవారని, కానీ ఇప్పుడు వంటశాల నిర్వహణ, మెస్ పనులు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా 1,200 మందికి పైగా శానిటేషన్ వర్కర్స్, వార్డెన్లను తొలగించడం అన్యాయం అన్నారు. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతూ, మరోవైపు విద్యార్థుల భుజాలపై పని భారం మోపటం తగదన్నారు.ఇటీవల ఆడియోలో వర్షిని చేసిన వ్యాఖ్యల్లోనే స్పష్టత ఉందని పేర్కొన్నారు. సమాజం సమానత కోసం ఏర్పాటైన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదని హెచ్చరించారు. ముఖ్యంగా ఎస్సీ వర్గాలకు చెందిన పిల్లలు ఎక్కువగా చదివే ఈ పాఠశాలల్లో విధేయతతో పని చేయించడాన్ని మానవతావాదులు ఖండించాలని ఆమె పిలుపునిచ్చారు.తక్షణమే సంబంధిత అధికారిని తొలగించాలని ప్రతి పాఠశాలకు నెలవారీ మెయింటెనెన్స్ ఖర్చులు మంజూరు చేయాలని విద్యార్థులతో పనిచేయించడం తక్షణం నిలిపివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.అది జర్నలిజమా లేక శాడిజమాబీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ పార్టీ పెట్టబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై ఆమె స్పందించారు. ఈ ఊహాగానాల్లో ఎటువంటి నిజం లేదని స్పష్టం చేస్తూ, ఒక దినపత్రికలో వచ్చిన కథనం క్లిప్పింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. "కనీసం నన్ను సంప్రదించకుండా ఈ వార్త రాసిన పత్రికది జర్నలిజమా?? శాడిజమా?" అంటూ ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం కవిత చేసిన ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.కొంతకాలంగా తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేసే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. జాగృతికి అనుబంధ సంఘాలను వరుసగా ప్రకటించడం, సంస్థ కార్యకలాపాలను విస్తరించడం వంటి పరిణామాలతో ఆమె కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది.

# ఎన్డీఎస్ఏ నివేదిక కాదు ఎన్డీయే నివేదిక

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



దరాబాద్ ప్రతినిధి మే28(తొలి క్రాంతి):మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఇచ్చిన నివేదికను ఎన్డీయే నివేదిక అనడంలో ఎలాంటి తప్పు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. నాణ్యత లేనిది కాళేశ్వరం, మేడిగడ్డలో కాదని.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న రాజకీయాల్లోనే అని విమర్శించారు. ఎన్ని కుట్రలు సృష్టించినా.. ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుందన్నారు. అశాస్త్రీయ ఆరోపణలను ఎల్ అండ్ టీ ఖండించడం సంతోషమన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అని కేసీఆర్ దూరదృష్టి గల నాయకుడు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం. కేసీఆర్ కి పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు' అని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు.ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్–బీజేపీ.. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్–బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం' అని ఎక్స్‌లో కేటీఆర్ రాసుకొచ్చారు.





# ఖమ్మం మహిళా మార్ట్ ప్రారంభించిన మంత్రి తుమ్మల

### మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రణాళి కబద్ధంగా డిమాండ్ అవసరం: తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన "ఖమ్మం మహిళా మార్ట్"ను బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళా సంఘాలు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెట్ డిమాండ్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దళారుల మద్దతు లేకుండానే మహిళలే తమ ఉత్పత్తులను విక్ర యించేలా మార్ట్ ఏర్పాటు చేయడం ఇందుకు భాగమని పేర్కొన్నారు.నగరంలోని నాలుగు ప్రధాన మార్కెట్లలో మహిళా సంఘాలకు ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ వంటి జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రదర్శించా లని సూచించారు.ముడిగొండ మహిళలు తయారు చేసిన బ్యాగులు బ్రాండెడ్ షాపులకన్నా మెరుగ్గా ఉన్నాయని ప్రశంసిం చారు.ప్రజలు వాడే ఉత్పత్తులను తయారుచేసే దిశగా మహిళా సంఘాలు పని చేయాలన్నారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం మహిళా మార్ట్ ద్వారా మహిళలకు ఆర్థికంగా బలమిచ్చే చర్యలు చేపట్టామని, ఉత్పత్తుల తయారీతో పాటు ప్యాకింగ్, మార్కెటింగ్ మీద శిక్షణ కూడా అందించినట్లు తెలిపారు.మహిళా సంఘాల ఉత్పత్తులు కల్తీ లేకుండా, నాణ్యతతో ఉండేలా చూస్తున్నామని, ఖమ్మం జిల్లాకు చెందిన 20 రకాల ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్ కల్పించామని వెల్ల డించారు.తర్వాత మంత్రి తుమ్మల ప్రకాష్‌నగర్ 29వ డివిజన్‌లో రూ. 60 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతిని ధులు, అధికారులు, మహిళా సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.





## లంబాడీ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

### సేవాలాల్ బంజారా సంఘం హెచ్చరిక

కొత్తగూడెం, మే 28 తొలి క్రాంతి:తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు మంత్రిపదవులు కల్పించకపోతే, మే 30న హైదరా బాద్ గాంధీ భవన్ వద్ద 1000 మందితో భారీ నిరసన చేపడతామని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ హెచ్చరించారు.కొత్తగూడెం పట్టణంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానోత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 45 నియోజకవర్గాల్లో లంబాడీ ప్రజలు అధికంగా ఉన్నా, ఇప్పటివరకు వారిని మంత్రివర్గంలో పరిగణించకపోవడం అన్యాయమన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడ వర్గ ఓట్లు కీలకంగా పనిచేశాయని గుర్తుచేసిన ఆయన, అగ్రకులాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణలో లంబాడీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వకపోతే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని లంబాడ వర్గం బహిష్కరిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు నునావత్ రాంబాబు నాయక్, భుక్యా రవికుమార్ నాయక్, బట్టు వీరన్న నాయక్, బోడ శ్రీనివాస్ నాయక్, బోడ మంగ నాయక్, రమేష్ నాయక్, గుగులోతు బాలు నాయక్, హరీష్ నాయక్, ధారావత్ నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఇన్‌స్పెక్టర్ నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపిన టి.బి.జి.కె.ఎస్ నాయకులు

మణుగూరు, మే 28 తొలి క్రాంతి:మణుగూరు ఏరియాకు కొత్తగా నియమితులైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. నాగబాబును బుధవారం సాయంత్రం టి.బి.జి.కె.ఎస్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను బహుకరించి, శాలువ కప్పి మిఠాయి ఇచ్చారు.విధి నిర్వ హణలో అంకితభావంతో పనిచేసి ప్రజలకు శాంతి, భద్రతలు కల్పించాలని ఆకాంక్షించారు. సింగరేణి పీవీ కాలనీలో ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్మికుల ఆస్తులను రక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, నాయకులు బంగారి పవన్ కుమార్, వినయ్ కుమార్, ముకేశ్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, రమేష్, శ్రీనివాస్, శ్రావణ్, రాజేష్, రమేష్ బాబు, రఫీ, ధర్మనందరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



## మలబార్ గ్రూప్ నుంచి సామాజిక సేవా కార్యక్రమాలకు రూ.150 కోట్లు

### – ఆకలిని తీరుస్తూ 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకం

ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:వరల్డ్ హంగర్ డే సందర్భంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ "హంగర్ ఫ్రీ వరల్డ్" కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 70,000 మందికి ఉచిత భోజనాలు అందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఖమ్మం మలబార్ షోరూంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత తుమ్మల యుగంధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.మలబార్ గ్రూప్, తమ 2025–26 సంవత్సర సి.ఎస్.ఆర్ బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించింది. ఇందులో 60% నిధులను ఆకలి నివారణ, పేదరిక నిర్మూలనకు వినియోగించనున్నారు. గత మూడు సంవత్సరాల్లో 2.5 కోట్ల భోజనాలు పంపిణీ చేసిన మలబార్ గ్రూప్, ఈ సంవత్సరం మరో 2.5 కోట్ల భోజనాల పంపిణీ లక్ష్యంగా ముందడుగు వేసింది.తెలంగాణలో మే 28నుంచి రోజుకు 2,100 మందికి భోజనం అందించనున్నారు. ఈ కార్యక్రమం ఐక్యరాజ్యసమితి "సుస్థిర అభివృద్ధి లక్ష్యం 2 – జీరో హంగర్" లక్ష్యంతో అనుసంధానమై కొనసాగుతుంది.ఇక విద్యా రంగంలోనూ మలబార్ గంభీరంగా అడుగులు వేసింది. దేశవ్యాప్తంగా 716 మైక్రో లెర్నింగ్ సెంటర్ల ద్వారా 32,000 మంది వీధిబాలలకు విద్య, పోషణ అందిస్తోంది. వీరిలో 9,000 మంది పిల్లలు అధికారిక పాఠశాలల్లో చేర్పించబడ్డారు. అలాగే 1.14 లక్షల బాలికలకు విద్యా సహాయంగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేశారు.'గ్రాండ్ హోమ్స్' ద్వారా నిరాశ్రయ మహిళ లకు ఉచిత వసతి కల్పించగా, కేరళలో 140 లాభాపేక్షలేని మెడికల్ స్టోర్స్‌ను ప్రారంభించేం దుకు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే 27 కేంద్రాలు ప్రజలకు సేవలందిస్తున్నాయి.సాంఘిక సేవలో విశిష్టంగా నిలిచిన మలబార్ గోల్డ్, తమ లాభాల్లో 5% భాగాన్ని సామాజిక సంక్షేమం కోసం కేటాయిస్తూ, స్థిరమైన అభివృద్ధికి నడిపే మార్గంగా నిలుస్తోంది.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, డాక్టర్ కూరపాటి ప్రదీప్, స్టోర్ హెడ్ ఎం.విష్ణు, మేనేజర్ ఎర్రబోయిన రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ మృతి పట్ల పలు సంఘాల సంతాపం



ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ గుండెపోటుతో మృతిచెందిన ఘటనపై పలు సంఘాలు తీవ్ర సంతాపం ప్రకటించాయి. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.మదన్ లాల్ మృతి బంజారా జాతికి తీరని లోటు అని సంఘాల నాయకులు వ్యాఖ్యానించారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించిన వారు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పిం చారు. అంతిమయాత్రలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు.లంబాడి హక్కుల పోరాట సమితి – నంగారా బేరి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ మాట్లాడుతూ, మదన్ లాల్ సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా ప్రజాసేవలో చూపిన నిబద్ధతను ప్రశంసించారు. అంతి మయాత్రకు టీఆర్ఎస్ నేతలు హాజరుకాకపోవడం విచా రకరమని, అధికారికంగా అంతిమసంకె తలపెట్టకపో వడం బాధాకరమన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా మదన్ లాల్ సంస్మరణ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.నివాళులర్పించిన వారిలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ నాయక్, పాలేరు ఇంచార్జ్ వీరన్న నాయక్, బహుజన జేఏసీ నాయకులు నాగే శ్వరరావు నాయక్, సంజీవరావు, రవి, శ్రీనివాస్, నరేష్, రాము, నాగరాజు, వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షు రాలు భూక్య ఉపేంద్రబాయి, జిల్లా గౌరవ సలహాదారులు కె. లక్ష్మి, నాయకులు బి. జ్యోతి, త్రివేణి, విజయ, లలిత, సరోజిని, కవిత, చందు, సుధా తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి"

### సిపిఐ రాష్ట్ర నేత బొల్లోజు అయోధ్య

అశ్వాపురం, మే 28 తొలి క్రాంతి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య పిలుపుని చ్చారు. బుధవారం అశ్వాపురం మండల సిపిఐ కార్యాల యంలో జరిగిన మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయోధ్య మాట్లాడుతూ, మండలంలోని శాఖా సమావేశాలు విజయవంతంగా నిర్వహించాలని, అలాగే జూన్ 22న జర గనున్న సిపిఐ మండల మహాసభలను ఘనంగా నిర్వహించా లని కోరారు. ఇందిరమ్మ హౌజింగ్ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని, సివిల్ స్కోర్ సంబంధం లేకుండా పేదలకు రాజీవ యువ వికాస్ పథకం వర్తింపజే యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సైరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, అనంతనేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.ఇతర పాల్గొన్న వారు: మేలపుర సురేందర్ రెడ్డి, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, మిత్తుల ఆర్, కమటం వీరన్న, తోట వెంకట నరసయ్య, చిలుకని శ్రీనివాస్, ఈనపల్లి పవన్ సాయి, అక్కినపల్లి నాగేం ద్రబాబు, కనితం ఉపేందర్, సబ్కా అజయ్, బాలాజీ, సత్యనా రాయణ, చంద్రరావు, ఎడెల్లి కమలాకర్, తేజావత్ జయమ్మ, తెల్ల వెంకటరమణ, బెజ్జన్నబోయిన నాగమణి, తురక అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోడు భూములు, వరద బాధితుల సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎంఎల్ వినతి

### – మంత్రి సీతక్క హామీ

భద్రాద్రి కొత్తగూడెం, మే 28 తొలి క్రాంతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో సాగు చేస్తున్న భూములను రైతులకు తిరిగి అప్పగించాలని, పోడుదారులపై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేయాలని, కొత్తగూడెం మరియు అశ్వరావుపేటలకు పర్మినెంట్ కమిషనర్లు నియమించాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ అధికారుల దాడులను ఖండిస్తూ, ఆర్.ఓ.ఎఫ్.ఆర్ రిజిస్ట్రేషన్ ఉన్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. గోదావరి వరద బాధితులకు మెట్ట ప్రాంతాల్లో ఇండ్ల స్థలాలు, చింతా లక్ష్మీ నగర్‌లో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిం చాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, నాయకులు ముసలి సతీష్, నరసింహారావు, కృష్ణ, జోగారావు, సుగుణ, సరస్వతి, లక్షి తది తరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం మున్సిపాలిటీకి రెగ్యులర్ కమిషనర్ నియామకాన్ని కోరుతూ వినతి

కొత్తగూడెం మున్సిపాలిటీలో రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నందున, తక్షణమే కమిషనర్ నియమించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆఫీస్ వద్ద మరియు స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కు వినతిపత్రం సమ ర్పించారు.ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం పాల్వంచ కమిషనర్ ఇన్చార్జ్‌గా ఉండటంతో, కొత్తగూడెం ప్రజలకు పరిపూర్ణ సేవలు అందడం కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలు కలవడం, సమస్యలు చెప్పుకోవడం కూడా కష్టసాధ్యమవుతోందని చెప్పారు. శుద్ధత లోపాలు, పార్కుల్లో చెత్త పెరుగుదల, పథకాల లభ్యత లోపించడం వంటివి ప్రజల జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నా యని పేర్కొన్నారు.కొత్తగూడెం జిల్లా కేంద్రంగా, నియోజకవర్గ ప్రధాన కేంద్రంగా ఉన్నా రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. దీంతో లక్షలాది ప్రజలు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే రెగ్యులర్ కమిషనర్ నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ఈ విషయంలో స్పందించి, ఈ నెల చివరికి అపాయింట్మెంట్ వచ్చే అవకాశముందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు ముసలి సతీష్, సరస్వతి నరసింహారావు, జోగారావు, మారుతి రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## రుణగ్రహీతలకు ఆదర్శంగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాలు

- వాటర్ కూలర్ కమ్ డిస్పెన్సర్ బహుకరించిన బ్యాంక్ మేనేజర్ బి. నవీన్
- సంఘాలను అభినందించిన ఏపీఎం రవివర్మ

జయశంకర్ భూపాలపల్లి, మే 28 తొలి క్రాంతి:జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఎస్బీఐ బ్యాంకు పరిధిలో ఉన్న స్వయం సహాయక సంఘాలు 100 శాతం రుణాలు తిరిగి చెల్లిస్తూ ఇతర రుణ గ్రహీతలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా, వారికి ప్రోత్సాహంగా బ్యాంక్ మేనేజర్ బి. నవీన్ వాటర్ కూలర్ కమ్ డిస్పెన్సర్‌ను బహుమతిగా అందించారు.బుధవారం వెలుగు సమాఖ్య కార్యాలయంలో వీవోఏల సమీక్ష సమావేశం నిర్వహించగా, ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నవీన్ మాట్లాడుతూ, రుణాలను సమయానికి చెల్లించడం వల్ల సభ్యులకు మళ్లీ రుణాలు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. రుణ చెల్లింపులో విఫలమైతే బ్యాంకు లావాదేవీలపై ప్రభావం పడుతుందని, అది ప్రజలకు, రైతులకు, మహిళా సంఘాలకు నష్టం కలిగించవచ్చన్నారు.100 శాతం రుణ చెల్లింపు సాధించిన సంఘాలకు ఏపీఎం రవివర్మ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, సీసీలు బి. శ్రీనివాస్, బి. ప్రవీణ్, వీవోఏలు ఎస్. తిరుపతి, వి. బాలకృష్ణ, ఎల్. బాపురావు, ఎస్. మాధవి తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ –మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:తెలుగు ప్రజల ఆరాధ్య నటుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డా. నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించుకుంటూ బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు ఒక ప్రకటన విడుదల చేశారు.ఎన్టీఆర్ రాజకీయ, సినీ జీవితాల్లో సాధించిన అపూర్వ విజయాలు తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని ఆయన పేర్కొన్నారు. ''ఎన్టీఆర్ వ్యక్తిత్వం ఎంత గొప్పదో, ఆయన సినీ జీవితం అంత గొప్పదే. రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు సామాజిక మార్పులకు బీజాంశాలుగా నిలిచాయి. ప్రజల బాగోగులు కోరే నేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారు'' అని నామ అన్నారు.సినిమా రంగానికి ఎన్టీఆర్ చేసిన సేవలుతెలుగు సినీ పరిశ్రమకు ఎన్టీఆర్ అందించిన సేవలు అపూర్వమైనవని నామ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతర కాలంలో తెలుగు సినిమాకు గర్వకారణంగా నిలిచిన ఎన్టీఆర్, పౌరాణిక పాత్రలతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుని, కళామతల్లికి సేవలందించారన్నారు. ఆయన నటన, పాత్రల అభినయం, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే విధానం నేటికీ కొత్త తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు.రాజకీయంలో విప్లవాత్మక మార్పులకు నాందిరాజకీయ నాయకుడిగా ఎన్టీఆర్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ప్రజల కోసం విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని నామ అన్నారు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేయడం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడం వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలు ఆయన నాయకత్వంలో అమలయ్యాయని గుర్తుచేశారు.పేదల సంక్షేమానికి ఎన్టీఆర్ బాటరూ. 2 కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పేదల గృహ నిర్మాణం, మధ్యాహ్న భోజన పథకాలు వంటి కార్యక్రమాలు సామాజిక న్యాయం కల్పించే దిశగా తీసుకున్న నిర్ణయాలేనని నామ చెప్పారు. ఈ విధంగా ఎన్టీఆర్ నేతృత్వంలో రాష్ట్రం మొత్తం ఒక పెద్ద సంక్షేమ రాష్ట్రంగా మారిందన్నారు.భారతరత్న ఎన్టీఆర్ హక్కుఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తాను 17వ లోక్‌సభలో డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా నామ గుర్తుచేశారు. ''భారతరత్న ఎన్టీఆర్‌కు లభిస్తే అది కేవలం ఒక వ్యక్తికి గౌరవం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి నెరవేర్చిన గుర్తింపు అవుతుంది,'' అని నామ వ్యాఖ్యానించారు.సేవా కార్యక్రమాల ద్వారా ఎన్టీఆర్‌కు నివాళితన అభిమానంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అనేక మండలాల్లో ఎన్టీఆర్ & నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని నామ తెలిపారు. ఆరోగ్య, విద్యా రంగాల్లో పేదలకు సేవలు అందించేందుకు ట్రస్ట్ కృషి చేస్తోందని వివరించారు.బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ సేవలుఎన్టీఆర్ సతీమణి బసవతారకం జ్ఞాపకార్థంగా స్థాపించిన బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆధునిక క్యాన్సర్ వైద్యం అందిస్తూ, సామాన్యులకు అందుబాటులో ఉండే స్థాయిలో సేవలందిస్తున్నదని నామ గుర్తుచేశారు.పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నామ కృషిపదిహేనవ లోక్‌సభ సమయంలో పార్లమెంట్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని చేపట్టిన తన పోరాటం ఫలితంగా అది సాకారమైందని చెప్పారు. అది తన జీవితంలో ఎంతో గౌరవమైన ఘట్టంగా గుర్తించుకున్నారు.ఎన్టీఆర్ – తెలుగు ఆత్మగౌరవ సంకేతం''ఎన్టీఆర్ అంటే కేవలం ఒక వ్యక్తి కాదు. ఆయన తెలుగు ప్రజల ఆత్మగౌరవం, సంప్రదాయాల ప్రతీక. ఆయన చూపిన మార్గం ఎన్నటికీ మిగిలిపోతుంది,'' అని నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.






ఖమ్మం, మే 28 తొలి క్రాంతి: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, నటరత్న డా. నందమూరి తారకరామారావు 102వ జయంతి సందర్భంగా ఖమ్మం త్రీ టౌన్ ఏరియాలోని కాల్వఓడ్డ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయనకు అభివాదం చేశారు.



## బొమ్మనపల్లిలో గ్రామ దేవతల పూజలు, నీరుపాల ప్రక్రియ ఘనంగా నిర్వహణ

టేకులపల్లి, మే 28 తొలి క్రాంతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలానికి చెందిన బొమ్మనపల్లి గ్రామంలో ఓ అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు, యువతలు సమష్టిగా పాల్గొని గ్రామ దేవతల పూజలు, హోమాలు, జలాభిషేకాలు నిర్వహించారు.ఈ వేడుకల్లో ప్రముఖ గ్రామ పెద్దలు దోర్నాల పాపారావు, నల్లమసు రాజన్న, బానోత్ సాములు నాయక్, హథీరామ్ నాయక్, బుర్ర ధర్మయ్యా గౌడ్, బొమ్మెర్ల ప్రసాద్, కమిటీ సభ్యులు రత్నా నాయక్, దోర్నాల శ్రీను ముఖ్యపాత్ర పోషించారు. వారి సమన్వయంతో వినాయక పూజ, హోమం వంటి పుణ్యకార్యాలు ఘనంగా జరిగాయి.గ్రామంలోని ప్రముఖ దేవాలయాలు అయిన బొడ్రాయి ముత్యాలమ్మ, రామాలయం, బ్రహ్మం గుడి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. గ్రామానికి తాళ్లులా ఉండే తండాల నుంచి వచ్చిన ఆడబిడ్డలు సంప్రదాయ మేళతాళాలతో శోభాయాత్రగా నీరు నింపుట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శోభాయాత్రలో పాటలు, డప్పులు, కోలాటాలతో గ్రామమంతా ఉత్సాహంగా మారింది.ఈ పుణ్య కార్యంలో గ్రామంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెద్దలు, మహిళలు, యువత తదితరులు భాగస్వామ్యమయ్యారు. హనుమంతు నాయక్, యాసరపు జనయా, నల్లమాడు శంకర్, హేమచంద్ర నాయక్, రవి, వల్లల రామారావు, బుర్ర శంకర్ లాంటి పలువురు ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దారు.ఈ విధంగా గ్రామస్థుల ఏకతాటిపై భాగస్వామ్యం, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు, సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచింది. గ్రామ దేవతల ఆశీస్సులతో బొమ్మనపల్లి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అందరూ ఆకాంక్షించారు.



## ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

### ఎన్టీఆర్ గారి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నివాళి

దమ్మపేట, మే 28 తొలి క్రాంతి:దమ్మపేట మండలం, మందలపల్లిలోని విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి, అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నటనలో వైవిధ్యమైన పాత్రలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఎన్టీఆర్ , విలక్షణ నటుడిగా మాత్రమే కాకుండా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడా అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు," అని పేర్కొన్నారు.తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ జీవిస్తారని తెలిపారు.తరుణ్ వివాహ వేడుకలో పాల్గొన్న మెచ్చా నాగేశ్వరరావుదమ్మపేట మోడల్ కాలనీలో శెట్టిపల్లి నారాయణరావు – సుజాత రాణి దంపతుల కుమారుడు తరుణ్ వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన వెంట దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, బుడే, బలుసు గోపి, కృష్ణయ్య, అప్పారావు, మహేష్, దండాబత్తుల కాంతారావు, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలకి "షీ రాక్స్" సెంటర్లు – కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళల చేత నిర్వహించే "షీ రాక్స్" జిరాక్స్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు.బుధవారం రఘునాథపాలెం తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద గార్లపాటి రమాబాయికి మంజూరైన షీ రాక్స్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు.




## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ నిర్వహణపై సమీక్షా సమావేశం

కొత్తగూడెం, మే 28 తొలి క్రాంతి:కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జూన్ 2, 2025న జరగనున్న 11వ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏరియా జీఎం కోటి రెడ్డి అధికారులతో మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ సమావేశంలో ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, ఎజీఎం (ఫైనాన్స్) హన సుమలత, డిజిఎం (పర్సనల్) శివ కేశవరావు, డిజిఎం (ఈ&ఎం) శ్రీకాంత్, సీనియర్ పిఒలు మజ్జి మురళీ, సంఘమిత్ర, సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్, మేనేజ్మెంట్ ట్రైనీ (సివిల్) సుమంత్, సేవకో–ఆర్డినేటర్ సి.హెచ్. సాగర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజల అవసరాలకు అధికారులు వెంటనే స్పందించాలి

### మంత్రి సీతక్కపలు సమస్యలు మంత్రి దృష్టికి.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వరావుపేట, మే 28 తొలి క్రాంతి:రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మిషన్ భగీరథ, మహిళా–శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క (అనసూయ) ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో తాగునీటి సరఫరా, గ్రామీణ రహదారుల అభివృద్ధి, మౌలిక వసతులు, మహిళా సంక్షేమం వంటి అంశాలపై సమీక్ష జరిగింది.అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వాటి పరిష్కారానికి అధికారులను తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించాలని ఆమె ఆదేశించారు.జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు:ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి శ్రద్ధ విజయవంతంగా ప్రసవించిన నేపథ్యంలో, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కలెక్టర్ జితేష్ వి పాటిల్ ని అభినందించారు. ప్రభుత్వ వైద్య సేవలపై విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు.





## లాభసాటి యూనిట్ల గ్రౌండింగ్‌కు కార్యాచరణ సిద్ధం

### : జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:రాజీవ్ యువ వికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్ల స్థాపనకు పటిష్ఠ కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.ఈ పథకం అమలుపై బుధవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.పథకం కింద లబ్ధిదారుల ఎంపిక, వ్యాపార యూనిట్ల ఎంపిక, నైపుణ్య శిక్షణ, యూనిట్ గ్రౌండింగ్, పర్యవేక్షణ వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి పెట్టుబడిగా మారి యువతకు లాభం చేకూరాలని డిప్యూటీ సీఎం సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 2న ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తామని, ఆతర్వాత ప్రతి నెలా యూనిట్ల గ్రౌండింగ్ కొనసాగిస్తామని వెల్లడించారు. అన్ని వర్గాలకు చెందిన లబ్ధిదారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు.ఈ సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, బీసీ సంక్షేమ అధికారిణి జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి నవీన్ బాబు, మైనారిటీ సంక్షేమ అధికారి పురందర్, గిరిజన అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఆడపిల్ల పుట్టిన ఇంటి కళకళలు: ఖమ్మం కలెక్టర్ శుభాకాంక్షలు

ఖమ్మం, మే 28 తొలి క్రాంతి:ఆడపిల్ల పుట్టిన ఇంటిని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించి స్వీట్ బాక్స్, ఫలాలు, దుస్తులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం నగరంలోని ద్వారకనగర్‌లో 51వ డివిజన్‌కు చెందిన షాజీదాబేగం–అఖీల్ దంపతుల ఇంటికి వెళ్లిన కలెక్టర్, వారి ఆడపిల్ల జననాన్ని పురస్కరించుకుని "మా పాప – మా ఇంటి మణిదీపం" కార్యక్రమంలో భాగంగా పాల్గొన్నారు.ఇంటిని పూలతో అలంకరించి, ముగ్గులు వేసి, "ఆడపిల్లలను పుట్టనిద్దాం.. పెంచనిద్దాం.." అనే నినాదాలతో అందంగా తయారు చేశారు. కలెక్టర్ చిన్నారి పాపను చేతుల్లోకి తీసుకొని ఊయలలో పడేసి ఆప్యాయత చూపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆడపిల్లల పుట్టుదల అదృష్టకరం అని, మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడుతున్నారని చెప్పారు. సమాజంలో మార్పు తల్లిదండ్రుల ఆలోచనల్లో నుంచే మొదలవుతుందన్నారు. ఆడపిల్లలు ఇంటికి మణిదీపాలు కావడంతో పాటు, దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిడిపివో వీరభద్రమ్మ, సూపర్వైజర్ విజయలక్ష్మి, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యంలో నమ్మకం

### జిల్లా కలెక్టర్ సతీమణి.. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు

### పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యంగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన కలెక్టర్ జీతేష్ పాటిల్ సతీమణి శ్రద్ధ పాటిల్

### ప్రభుత్వ వైద్యంలో విశ్వాసానికి నిలువెత్తు ఉదాహరణ

పాల్వంచ,మే 28 తొలి క్రాంతి:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ జీతేష్ వి పాటిల్ పాల్వంచలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. తల్లి మరియు శిశువు ఇద్దరూ పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.ఇది ఆమెకు తొలి ప్రసవం కావడం గమనార్హం. గర్భధారణ తొలినుంచి అన్ని వైద్య పరీక్షలు, చికిత్సలు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వహించుకోవడం, తుది దశలో కూడా కార్పొరేట్ ఆసుపత్రులు కాకుండా ప్రభుత్వ ఆసుపత్రికే మద్దతుగా నిలవడం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలకి గూడు అయింది.ఈ ఎంట్రీ ప్రక్రియను డి.సి.హెచ్.ఎస్ డాక్టర్ రవిబాబు పర్యవేక్షించారు. అనుభవజ్ఞులైన ప్రభుత్వ వైద్యుల సలహా, సహకారంతో ప్రసవం సజావుగా జరిగింది.ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకానికి కొత్త దిశా:ఈ సంఘటన ద్వారా కలెక్టర్ కుటుంబం ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే విధంగా నిలిచింది. సాధారణ ప్రజలు అధిక ఖర్చుతో కార్పొరేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతున్న ఈ రోజుల్లో, ఓ జిల్లా కలెక్టర్ సతీమణి ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవడం స్ఫూర్తిదాయకం.ఈ చర్య ద్వారా జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య వ్యవస్థపై తన విశ్వాసాన్ని చాటడమే కాక, కింద స్థాయి వరకు ఆరోగ్య సేవల బలోపేతానికి ఇది బలమైన సంకేతమై నిలిచింది. ఇది ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆదర్శంగా నిలవాలనే ఆశించవచ్చు.సామాజిక మార్పుకు ప్రేరణ:ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా నాణ్యమైన సేవలు అందుబాటులో ఉన్నాయని, అక్కడ పనిచేస్తున్న వైద్యుల సామర్థ్యం అంతే ఉన్నతమై ఉందని ఈ ఉదంతం ద్వారా స్పష్టమవుతోంది. కలెక్టర్ దంపతుల ఈ నిర్ణయం ప్రజల్లో ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకాన్ని మరింత పెంచుతుంది.తాజా సమాచారం:ముగ్గురి కుటుంబంలోకి కొత్త చిన్నారి రాకకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ప్రజలతో పాటు, ఉద్యోగ వర్గాలనుంచి కూడా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



